ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023 | 5 | అనంతపురం



వేగవంతంగా అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 412 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు సరైన పద్ధతి ప్రకారం సకాలంలో పరిష్కారం చూపించాలన్నారు. అర్జీదారుడి సంతకం లేకుండా ఫిర్యాదుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వరాదన్నారు. అర్జీదారుల సంతృప్తి స్థాయి తక్కువగా ఉందని, సంతృప్తి స్థాయిలో పురోగతి మరింత పెరగాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు సంబంధించి రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, అగ్రికల్చర్, ఏపీఎస్పీడీసీఎల్, తదితర శాఖల నుంచి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయన్నారు. వాటిని గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఆర్డీవో గ్రంధి శ్రీనివాస్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రబీ ఆశలు ఆవిరి..!

◆ పప్పుశనగ సాగుకు ముగుస్తున్న సమయం ◆ ఐదు శాతంలోపే సాగు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌లో మొదలైన వర్షాభావం రబీలోనూ కొనసాగుతోంది. వర్షాభావం అక్టోబర్ నెలలోనూ నెలకొనడంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలోనే రబీ సాగు అవుతున్నప్పటికీ నల్లరేగడి నెలల్లో పప్పుశనగ ప్రధానంగా సాగయ్యేది. ఈ పంట సాగుకు అక్టోబరు ఆఖరుకే కీలకమైన సమయం. నవంబరు మొదటి వారం దాటితే అంత అనువైన సమయం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. ఇప్పటి వరకు చినుకు జాడ లేకపోవడంతో ఇకపై రబీ సాగు ముందుకు సాగే అవకాశాలు కనిపించడం లేదు.

ఐదు శాతంలోపే సాగు

అనంతపురం జిల్లా పరిధిలో రబీలో 3.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇందులో ప్రధానంగా 1.93 లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగవుతుంది. ఆ తరువాత స్థానం వేరుశనగ పంటది ఉంటుంది. అది కూడా బోరు బావుల కింద ఇతర పంటలు సాగవుతాయి. కాని ఇప్పటి వరకు చూస్తే కేవలం 16,600 ఎకరాల్లో మాత్రమే పప్పుశనగ పంట సాగైంది. అంటే సాధరణంలో ఐదు శాతం మాత్రమే విత్తనం పడింది. వేరుశనగ అయితే 50 వేల ఎకరాల్లో సాధారణ సాగు కాగా, ఇప్పటి వరకు ఒక్క ఎకరంలోనూ విత్తనం పడలేదు. ఇక సత్యసాయి జిల్లాలో రబీ సాధారణ సాగు 69వేల ఎకరాలు. ఇందులో ఇక్కడ ప్రధానంగా వేరుశనగ పంటయే రబీలో సాగవుతుంది. 43 వేల ఎకరాలు సాధారణ వేరుశగయే ఉంటుంది. వర్షాల్లేక భూగర్భ జలాలు తగ్గిపోయే సూచనలు కనిపిస్తుండటంతో ఇక్కడా వేరుశనగ సాగు చేయాలా.. వద్దా అన్న మీమాంస రైతుల్లో నెలకొంది. సత్యసాయి జిల్లాలో రబీ పూర్తిగా ఎత్తిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అక్టోబర్‌లోనూ వర్షాభావమే

రబీ పంటల సాగుకు కీలకమైంది అక్టోబరు మాసం. ఈ మాసంలోనూ అటు అనంతపురం, ఇటు సత్యసాయియి జిల్లా రెండు చోట్లా తీవ్ర వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో అక్టోబర్ మాసంలో సాధారణ వర్షపాతం 98 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 6.4 మిల్లీమీటర్ల మాత్రమే నమోదయ్యింది. సత్యసాయి జిల్లాలో 115.2 మిల్లీమీటర్లకుగానూ 2.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 417.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 253.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. సాధారణం కంటే 39.2 శాతం తక్కువ వర్షపాతం ఈ ఏడాది నమోదయ్యింది. సత్యసాయి జిల్లాలో 471.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికిగనానూ 299.2 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. 33.6 శాతం ఈ ఏడాది వర్షపాతలోటుంది. రెండు జిల్లాల పరిధిలోనూ అటు ఆరు మండలాలు, ఇటు ఆరు మండలాల్లో మినహా తక్కిన అన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఈ ఏడాది రబీ ఆశలు కూడా సీజన్ ప్రారంభంలోనే ఆవిరయ్యే సూచనలు కనిపిస్తుండటం రైతులను దిక్కుతోచని స్థితిలోకి పడేస్తోంది.

6 నుంచి సిపిఎం స్కూటర్ యాత్ర

◆ వ్యవసాయం- పరిశ్రమలపై వైసిపి వైఖరి ప్రకటించాలి ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివద్ధిలో వ్యవసాయం, పరిశ్రమలు కీలకమని వీటిపట్ల వైసిపి తన వైఖరి ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 29న నిర్వహించిన జిల్లా సమగ్రాభివద్ధి- ప్రత్యామ్నాయ విధానాల సదస్సు తీర్మానాలను సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి వివిధ రంగాల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ విధానాల గురించి ఈ సదస్సులో తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి ఇచ్చిన హామీల అమలు పది సంవత్సరాల గడువు ఈ సంవత్సరం చివరికి పూర్తవుతుందని, ఆ హామీలు అమలు కానందున మరో పది సంవత్సరాల ఈ గడువు పొడగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలన్నారు. జిల్లా వ్యవసాయంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. గతంలో కేవలం వేరుశనగ వంట మాత్రమే సాగవుతున్న స్థితి నుంచి నేడు ఎడారిలో పండే కర్జూరం, మంచు ప్రాంతాల్లో పండే ఆపిల్ పండ్ల వరకు జిల్లాలో పండిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 7.5 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు అవుతున్నాయని తెలిపారు. ఈ పంటల దిగుబడులకు అనుగుణంగా జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం, పరిశ్రమలు స్థాపించకపోతే రైతులు మరో విషాదంలో కూరకపోతారని తెలిపారు. సాగునీటి వనరులు అభివద్ధి చెందుకుండా జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు అభివద్ధి చెందవన్నారు. హంద్రీనీవాకు నిర్ణయించన ఆయకట్టుకు నీరు అందివ్వడం, హెచ్ఎల్‌సి కాలువ నిర్వహణ, ఆధునీకరణకు అవసరమైన నిధులు, సిబ్బందిని నియమించాలన్నారు. ప్రస్తుతం హెచ్ఎల్‌సి, హంద్రీనీవా కింద సాగవుతున్న పంటల రక్షణ కోసం కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి నీటి సదుపాయం కలిపించాలన్నారు. జిల్లాలో ఉన్న ఖనిజవనరులు ఆధారంగా పరిశ్రమలు స్థాపించాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రాయితీలను ప్రభుత్వం ఇచ్చి స్థాపించాలన్నారు. ఐటి పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కలిపించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సామాజిక తరగతుల అభివద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలంటే కుల గణన జరగాలన్నారు. జిల్లా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల అంచనాకు తెలంగాణలోని 'సెస్' తరహాలో గణాంకాలు ప్రతి సంవత్సరం ప్రకటించాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో వచ్చిన కరువులో కూలీలు వలసలు వెళ్లకుండా నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలన్నారు. విద్యా, వైద్యం పూర్తి వ్యాపారంగా మారాయని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులు లేక మూతపడే స్థితికి వచ్చాయని, మరోవైపు నారాయణ, చైతన్య కాళాశాలల్లో పది వేల మందికి పైగా జిల్లా విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. దీని వల్ల రూ.వేల కోట్లు భారం జిల్లా ప్రజల మీద పడుతోందన్నారు. జిల్లాలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వందలాది పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. రైతుల ఆత్మహత్యల్లాగా నిరుద్యోగుల ఆత్మహత్యలు ప్రారంభమవుతునాయని, వీటిని అరికట్టడానికి వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మాణాలను ప్రజల్లో ప్రచారం చేసి ప్రభుత్వంపై పోరాడడం కోసం ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్కూటర్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 15న విజయవాడలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటి సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి వి.రామిరెడ్డి, ఎం.నాగమణి పాల్గొన్నారు.



సమగ్రాభివద్ధి- ప్రత్యామ్నాయ విధానాల సదస్సులో వచ్చిన తీర్మానాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ ఎం.గౌతమి



కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం పనులు, హౌసింగ్ కింద ఇళ్ల నిర్మాణాల్లో కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న నవంబర్, డిసెంబర్ రెండు నెలలు అత్యంత ముఖ్యమన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద 2,888 పనులను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,793 పనులు గ్రౌండింగ్ అయ్యాయన్నారు. మిగిలిన 95 పనులు కూడా వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి గ్రామ సచివాలయ భవనాలు 469 మంజూరు కాగా, 270 భవనాలను పూర్తి చేసి ఇప్పటికే అప్పగించామన్నారు. మిగిలిన భవనాలను వేగవంతం చేయాలన్నారు. వీటితో పాటు రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, వైఎస్సార్ డీజిటల్ లైబ్రరీలు, ఇతర భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమం కింద వారం రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు లేఅవుట్లను తనిఖీ చేసి ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ తక్కువగా ఉందని, మరింత పురోగతి సాధించాలన్నారు. జిల్లాలో మూడో దశలో రీ సర్వే కింద ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టిన పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ప్రశాంత్ కుమార్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, డీఆర్డీఏ హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావుతో పాటు వివిధ శాకల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ'

3న చెన్నేకొత్తపల్లిలో యాత్ర ప్రారంభం
మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పరిటాల సునీత

రాప్తాడు నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి సంబంధించి మాజీ మంత్రి పరిటాల సునీత రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. నవంబర్ మూడవ తేదీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అనంతపురంలోని తన నివాసంలో అనంతపురం, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులతో సోమవారం నాడు సమావేశం నిర్వహించారు. ఏఏ రోజు ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నది నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. 4, 5వ తేదీల్లో అనంతపురం రూరల్ పరిధిలోని ఆకుతోటపల్లిలో కార్యక్రమం ఉంటుందన్నారు. 6, 7 తేదీల్లో ఆత్మకూరు మండలంలో 8, 9 తేదీల్లో రాప్తాడు మండలాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు సూపర్ సిక్స్ అనే అద్భుతమైన పథకాలను తీసుకొచ్చారన్నారు. టిడిపికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార వైసిపి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి ఆరు పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు, భూదందాలు, వైఫల్యాలనూ ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి కూడా ప్రజలందరికీ తెలియజేయాలన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడిపత్రి



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు, బిజెపి విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న వైసీపీ వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సుయాత్రపు జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి ప్రజా రక్షణ బేరి బస్సుయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రాన్ని విభజించే సందర్భంలో అనేక హామీలు ఇచ్చిందన్నారు. ముఖ్యంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించమని, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లపాటు ఇస్తామని, కర్నూలులో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామని, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందుకోసం పోరాడాల్సిన రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రానికి తలొగ్గి వారి ఆదేశాలనే పాటిస్తోందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని బిజెపిపై ఒత్తిడి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మరోవైపు ప్రతిపక్షాలు కూడా ఆందోళనలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. ఈనేపథ్యంలో బిజెపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర వచ్చేనెల 1వతేదీన తాడిపత్రికి చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆరోజు తాడిపత్రిలోని మున్సిపల్ మార్కెట్ ఎదురుగా బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభలో కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

15న చలో విజయవాడ : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు



గోడపత్రికలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలపై వచ్చేనెల 15న ప్రజా రక్షణభేరి పేరుతో పేరుతో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడగొట్టి పదేళ్లు కావస్తోందన్నారు. అయినా కేంద్రంలోని బిజెపి పెద్దలు ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ, అనంతపురం జిల్లాలో సెంట్రల్ యూనివర్సిటీ, కుదిరే ముక్ పరిశ్రమ,నాసా బెల్ కంపెనీ వంటివి అమలు చేయలేదన్నారు. అంతేగాకుండా బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మరోపక్క వైసీపీ ప్రభుత్వం కూడా మోడీ చెప్పిన వాటికి తలఊపుతూ ప్రజల పైన అనేక భారాలు మోపుతోందని విమర్శించారు. ఆస్తి, చెత్త పన్నులు, విద్యుత్ ఛార్జీల భారాలు, రైతుల మోటర్లకు మీటర్లు రకరకాల పేర్లతో ప్రజలపై అనేక భారాలు మోపుతోందన్నారు. బిజెపి, వైసిపి దుర్మార్గమైన పాలనపై పోరాటానికి ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ నాయకులు బి.చంద్ర, బి.తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, చెర్రీ, తదితరులు పాల్గొన్నారు.



శాంతి భద్రతల పరిరక్షణకు కృషి : డిఐజి

సిబ్బందితో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయలసీమలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని రాయలసీమ రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం స్థానిక వినాయక కూడలి నుంచి పోలీస్ స్టేషన్ వరకూ పర్యటించారు. స్టేషన్‌లో ఫిర్యాదుల రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. అనంతరం డిఐజి విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. కుటుంబ కలహాలను నివారించేందుకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాలు నిర్వహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన సందర్భంలో సెక్షన్-30ని ఉపయోగించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచి దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉదయం, సాయంత్రం పోలీసింగ్ నిర్వహించాలని, జాతీయ రహదారులపై పర్యటించాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాల న్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. కర్నాటక మద్యం రాష్ట్రంలో ప్రవేశించకుండా నిఘా పెట్టాలని, తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఆయనతో పాటు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ, రూరల్ సిఐలు లక్ష్మణ్, యుగంధర్ ఉన్నారు.

ఆకట్టుకున్న పోలీసుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శన

పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో సోమవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు తెలియజేసే గీతాలను వాయిద్య బృందాలు ఆలపించాయి. ప్రజల భద్రత, సమాజ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ మేము సైతం అంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ఎ.హనుమంతు, 14వ బెటాలియన్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐలు రెడ్డప్ప, వెంకటేష్ నాయక్, మోహన్, శేఖర్, ఆర్ఐలు హరికృష్ణ, లోకేశ్వరనాయుడు, రామారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, పలువురు ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు వాయిద్య బృందం, 14వ బెటాలియన్ వాయిద్య బందం, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పోలీసుల త్యాగాలు మరువలేనివని 14వ పటాలం కమాండెంట్ ఆర్.గంగాధర్‌రావు కొనియాడారు. పోలీసుల అమరువీరుల దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక బెటాలియన్‌లో పోలీసుల త్యాగాలపై ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీసుల త్యాగాలను గుర్తు చేశారు. ఈ కార్యకమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ట్రైనీ డీఎస్పీలు, ఆర్ఐలు లోకేశ్వరనాయుడు, సీతారామారావు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నార్పలలో 2కే రన్ నిర్వహించారు. ఇందులో భాగంగా రన్ ఫర్ యూనిటీలో భాగంగా సమైక్యతను చాటుతూ స్థానిక బాలుల పాఠశాల క్రీడా మైదానం నుంచి కొత్త బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్టోబర్ 31 దేశ మాజీ హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ సమైక్యతా దివస్‌ని పురస్కరించుకుని పోలీసులు, విద్యార్థులు, క్రీడాకారులు, జర్నలిస్టులు, వాకర్లు, స్థానికులతో కలిసి 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాము, అమర్, దివాకర్, అనిల్‌కుమార్, హాకీ శిక్షకుడు వెంకట్రామిరెడ్డి, పాత్రికేయులు వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, షేర్‌ఖాన్, దిలీప్, వాకర్లు ప్రకాష్, శేషు, సురేష్, జాఫర్, సునీల్, కుమార్‌రెడ్డి, శివ, షేక్షావలి, ప్రతాప్, శంకర్‌రెడ్డి, షరీఫ్, భాస్కర్‌రెడ్డి, రాజా, రహమతుల్లా, ఖలీల్, జాఫర్ హుస్సేన్ పీరా, బాబావలి, హాకీ, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ కె.జనార్ధన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జనార్ధన్ మాట్లాడుతూ అక్టోబర్ 31 మాజీ హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రీయ సమైక్యత దివస్ ని పురస్కరించుకుని పోలీసులు, విద్యార్థులు, క్రీడాకారులు, వాకర్లు, స్థానికులతో కలిసి రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హాకీ క్రీడాకారులు, స్థానికులు, పాల్గొన్నారు.

ఇసుక గుంతలను పూడ్చేందుకే పెన్నానదికి నీరు

జెసి.దివాకర్‌రెడ్డి, జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

నాలుగున్నరేళ్లపాటు విచ్చలవిడిగా అక్రమంగా ఇసుక తరలించి కప్పిపుచ్చుకునేందుకు పెన్నానదికి నీరు వదిలారని జెసి సోదరులు దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని టిటిడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలించి వచ్చిన డబ్బును లెక్కపెట్టుకోవడానికే సమయం సరిపోయిందన్నారు. ప్రజలు, రైతులకు చేసింది శూన్యమన్నారు. ఇసుకను అమ్ముకుని గుంతలు ఏర్పడగా వాటిని కప్పిపుచ్చుకునేందుకు నీరు వదిలారన్నారు. రైతుల నోట్లో దుమ్ముకొట్టి సాగునీరు వదిలానని ఎమ్మెల్యేలు ప్రగడ్బాలు చెప్పుకోవడం బాధాకరమన్నారు. జిల్లాలో నీటి సమస్య ఇంత ఉన్నా ఏటా కర్ణాటకలో జరిగే నీటి సమావేశాలకు వెళ్లే అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. వీరు కర్ణాటక వాళ్లతో లాలూచిపడ్డారా..? అని దుయ్యబట్టారు. చాగల్లు, యాడికి కాలువల్లో జమ్ము గడ్డి పెరిగి నీరు ఎలా పారుతుందో తెలియదా అని ఎద్దేవాచేశారు. కావున రానున్న రోజుల్లో టిడిపి విజయం సాధించేందుకు ప్రతికార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మిమ్మల్ని నమ్మినందుకు వమ్ము చేయకుండా బాగా కష్టపడాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం దొంగ ఓట్లకు సంబంధించి జాబితా వచ్చింది. వాటిని పరిశీలించి వాస్తవ ఓటర్లను గుర్తించడంతోపాటు ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాలూ అవసరం

జెన్‌టియు రెక్టార్ ఎం.విజయకుమార్

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులకు విద్యతోపాటు నైపుణ్యాలు చాలా అవసరమని జెఎన్‌టియు రెక్టార్ ఎం.విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాలులో సైన్సు, హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం-2020 సస్టేన్ బుల్టి అనే అంశంపై ఎఐసిటిఇ ప్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువుతో పాటు నైపుణ్యాలకు ఎంతో ముఖ్య పాత్ర ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు తమకున్న విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా పెంపొందించుకోవడానికి, విద్యార్థులకు నూతన విషయాలను అర్థమయ్యేలా బోధించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, ఉస్మానియా విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పి.సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, కె.యఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, కోఆర్డినేటర్ వి.బి.చిత్ర, కో కోఆర్డినేటర్ జి.మమత పాల్గొన్నారు.

జెఎన్‌టియులో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాలు మేరకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ(జెఎన్‌టియుఎ) సోమవారం వర్శిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. రెగ్యులర్ ప్రొఫెసర్ 7 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్స్ రెగ్యలర్ కింద 16 పోస్టులు, బ్యాక్ లాగ్ కింద 16పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ర్యెగ్యలర్ ప్రాతిపదికన 157, బ్యాక్‌లాగ్ కింద 3 పోస్టులు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టు 1 భర్తీచేయన్నుట్లు తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు జెఎన్‌టియు, ఉన్నత విద్యామండళి వెబ్‌సైట్ చూసుకోవచ్చని తెలిపారు.

జగనన్నకు అండగా నిలుద్దాం : ఎమ్మెల్యే పద్మావతి


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం జగన్‌కు అండగా నిలుద్దామని ఎమ్మెల్యే పద్మావతి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, నిట్టూరు రఘునాథరెడ్డి, ఎంపిపి నాగేశ్వరరావు, జెడ్పీ వైస్ ఛైర్పర్సన్ నాగరత్నమ్మ, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, వెంకటలక్ష్మి, సుప్రియ, శ్రీరాములు, సాబీరా, కేశవరెడ్డి, దాడితోట బాషా, నాగలింగారెడ్డి, అమీర్‌బాషా, శివయ్య, ఖాదర్‌వలీఖాన్, రఘువీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్ల కలను సాకారం చేయడం సంతృప్తికరం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

15ఏళ్లుగా పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించడం ఎంతో సంతృప్తికరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండలోని కొలిమి లేవుట్ కాలనీలో కోర్టు వివాదం నుంచి క్లియరెన్స్ పొందిన 589-5 సర్వే నెంబర్‌లో 255 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయింపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా ఎన్నో అడ్డంకులు సృష్టించడంతోపాటు అనేక దొంగపట్టాలు ఇచ్చి నిలువునా మోసం చేశాడని విమర్శించారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక కోర్టులోని సమస్యను పరిష్కరించి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, ఉప సర్పంచి వన్నప్ప, పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు ఈడిగ ప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ అసీఫ్, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, మండల సర్వేయర్ రత్నాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

1న సమాచార హక్కు చట్టాంపై సదస్సు

ప్రజాశక్తి-ఉరవకొండ

నవంబర్ 1న బుధవారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల పెన్షనర్స్ భవన్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం సోమవారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతిని ప్రశ్నించేతత్వం కలిగిన యువతీ, యువకులు పాల్గొని సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో జరిగే అవినీతిని సమాచార హక్కు చట్టం ద్వారా వజ్రాయుధంగా చేసుకుని వారితో సామాన్య ప్రజానీకానికి పనిచేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సుకు జిల్లా అధ్యక్షులు వన్నూరప్ప, గౌరవాధ్యక్షులు కంబునూరు షేక్ నబిరసూల్, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గం సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి వన్నూరుసాబ్, కొత్త రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' గొప్ప కార్యక్రమమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని శాంతి నగర్ వద్ద సోమవారం మున్సి పల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఇందులో వైద్యులు ఉమా మోహన్, మనోజ్‌కుమార్, అజహర్‌ఖాన్, మోమిన్, ప్రతిభ పట్టణంలోని 28, 29 వార్డుల ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వలిబాషా, గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, ఫకృద్దీన్, లావణ్య, మంజునాథ, వైసిపి పట్టణ అధ్యక్షుడు శివప్ప, నాయకులు రిబ్కా, రవి, ఇస్మాయిల్, దివాకర్, సత్యనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. సోమవారం మండలంలోని దండువారిపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 506 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రి, 86మందిని కంటి పరీక్షలకు, 26 కంటిపొర చికిత్స కోసం సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నీలం భాస్కర్, సర్పంచి బం2డి రేణుక, ఎంపిటిసి గాయత్రి, వైస్ సర్పంచి పద్మనాభయ్య, డిఎంఅండ్‌హెచ్ఒ దేవి, ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారిణి సుజాత, మండల ప్రత్యేక అధికారిణి దేవి, వైద్యులు స్వాతిలక్ష్మి, హర్ష, వెంకటరమణ, విజయ్‌పాల్‌రెడ్డి ఎంపిడిఒ తేజోష్ణ, తహశీల్దార్ రమాదేవి, నాయకులు బయపరెడ్డి, అంకే నరేష్, బండి రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రవీంద్ర, శ్రీరాములు, పెద్దిరెడ్డి, మహానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన తాగునీటి పథకం నిర్వహణ

సెల్ఫీ ఛాలెంజ్‌లో కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి హయాంలో పట్టణంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచామని, ప్రస్తుతం నిర్వహణ అటకెక్కిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని 5వ వార్డులో తాగునీటి సరఫరాపై సోమవారం కాలవ 29వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే నాటికి పట్టణంలో పలుప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండేదని, ఈ వార్డులో సరైన పైపులైన్ లేక ఉప్పునీటితోనే కాలం గడిపేవారన్నారు. వారానికి రెండుసార్లు మాత్రమే ట్యాంకర్లతో నీరు సరఫరా చేసేవారన్నారు. తాను ఎమ్మెల్యే గా గెలిచాక రూ. 15 లక్షలు ఖర్చు చేసి పైపులైన్ వేయించి తాగునీరు అందించానన్నారు. 2014-19 మధ్య పట్టణంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడానికి అత్యంత ప్రాధాన్యమిచ్చామన్నారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ప్రస్తుత పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల పట్టణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి పనులే నేడు ప్రజల అవసరాలు తీరుస్తున్నాయని కాలవ వివరించారు.

బాలుడికి చికిత్స చేయని వైద్యురాలు

వేళాపాలా లేదా అంటూ తల్లిదండ్రులపై ఆగ్రహం

ప్రజాశక్తి-కణేకల్లు

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రాత్రి ఓ బాలుడికి చికిత్స చేయడంలో వైద్యురాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటన కణేకల్లులో తీవ్ర చర్చనీయాంశమైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కణేకల్లుకు చెందిన అఫ్జల్ రెహ్మాన్ దంపతులు ఏడాదిన్నర కుమారుడు ఆహిల్ దగ్గు, జలుబుతో ఇబ్బంది పడుతుండగా రాత్రి 7:30 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న చిన్నపిల్లల డాక్టర్ పావని వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'ఎప్పుడుపడితే అప్పుడు ఆసుపత్రికి వస్తారా.. సమయం, సందర్భం తెలియదా.. నేను ఈ సమయంలో వైద్య పరీక్షలు చేయనని తెలిపింది'. దీంతో వారు సదరు డాక్టర్‌ను బతిమలాడినా ఆమె ససేమిరా అనడంతో విధి లేని పరిస్థితుల్లో వారు బాలుడిని తీసుకుని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. ఈ విషయంపై సదరు డాక్టర్‌ను వివరణ కోరగా ఓపీ సమయంలో వచ్చిన వారికి మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించాలని జీవో ఉందని ఘాటుగా సమాధానం చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. డాక్టర్ వైఖరి పట్ల రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది అసహనం వ్యక్తం చేయడం గమనార్హం

పంటలు పూర్తయ్యే వరకూ సాగునీరివ్వాలి

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హెచ్‌ఎల్‌సి, జిబిసి, హంద్రినీవా కాలువల కింద సాగు చేసిన పంటలు పూర్తయ్యే వరకూ సాగునీరు అందించాలని ఎపి రైతుసంఘం, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.బాలరంగయ్య, ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో, హెచ్‌ఎల్సీ ఆయకట్టు కింద 80 వేల ఎకరాలకు పైగా, హంద్రీనీవా కాలువ కింద 20 ఎకరాలకు పైగానే పంటలు సాగు చేశారని తెలిపారు. మిర్చి, మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది మొదలైన పంటలను సాగు చేశారని తెలిపారు. హెచ్‌ఎల్‌సి ఎస్‌సి తుంగభద్ర డ్యామ్‌లో వర్షాభావం చేత అనుకున్నంత నీరు రాలేదన్నారు. అందువల్ల ముందుగా ప్రకటించిన 26 టీఎంసీలకు ప్రస్తుతం 16 టీఎంసీలు మాత్రమే నీరు వస్తున్నట్లు ప్రకటించారన్నారు. వాటిలో టీఎంసీలు తాగునీటికి, 6 టీఎంసీలు కాలువలకు, చెరువులకు నవంబరు 10 వరకు మాత్రమే వస్తాయని అని ప్రకటించడం రైతులను ఆందోళనలు కలిగిస్తున్నాయని తెలిపారు. పంటలు పూర్తయ్యేంత వరకూ సాగునీరు ఇచ్చి రైతాంగానికి భరోసా ధైర్యాన్నివ్వాలని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలన్నీ మాఫీ చేయాలన్నారు. పశువులకు గడ్డి కొరత లేకుండా వెంటనే పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు, కుడేరు మండలాల్లో ఆందోళన చెందుతున్న రైతులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టి రైతుల సంతకాలతో కూడిన వినతి పత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి పోస్టల్ ద్వారా పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, విరుపాక్షి, పోతులయ్య, శివ, భీమేష్, నాగమణి, వన్నూరప్ప పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 8న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ నాయక్, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు సురేంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం గుత్తిలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలనికి నిధులు కేటాయించి, సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం ను ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈబంద్‌కు విద్యార్థులు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, చిన్న, పెదబాబు, కిరణ్, పవన్ గౌడ్, ఆది, సాయి, పాల్గొన్నారు.

అనంతపురం : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను నిలిపివేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న చేపట్టనున్న జయప్రదం చేయాలని పిడిఎస్ఒ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్య, జెఎన్‌టియు రెక్టార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఒ అనంతపురం కన్వీనర్ సాకే అశోక్‌కుమార్, కో-కన్వీనర్ సంజీవ్‌రాజు, అశోక్‌కుమార్, సంజీవ్‌రాజు, కోశాధికారి సందీప్, కమిటీ సభ్యులు ఆష్రఫ్‌వలి, అనిల్, యోగేష్, శర్మస్‌వలి, అభి, శివ, మునేశ్వర్, సన్నీ, సంపత్, ప్రవీణ్, నారాయణస్వామి, నవీన్ పాల్గొన్నారు.

ఎన్నికలొస్తున్నందునే ప్రజలు గుర్తుకొస్తున్నారు..

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్నికలు దగ్గరపడుతున్నాయి కాబట్టి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ప్రజలు గుర్తుకొస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం విడపనకల్లు ఎస్ఎస్ ట్యాంకును ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ అంజుమాన్ షఫ్రీన్, ఏఈ ధనుంజయతో కలిసి పరిశీలించారు. నవంబర్ రాక మునుపే ట్యాంకును పూర్తిస్థాయిలో నింపడంపై గోపాలకృష్ణ, అశోక్‌రెడ్డిని అభినందించారు. అనంతరం గంగపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేవలం ఓట్ల కోసమే రాజకీయాలు చేసే కేశవ్‌ను చూస్తే సిగ్గుగా ఉందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లు విజయవాడ, హైదరాబాద్‌కే పరిమితమైన కేశవ్ నాలుగైదు నెలల్లో ఎన్నికలు వస్తాయనగానే ఎక్కడ లేని ప్రజా సమస్యలు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో తాగు, సాగునీరు, విద్యుత్‌కు ఇబ్బందులు తలెత్తాయన్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న పయ్యావుల అప్పుడే నీటి రాజకీయాలు మొదలు పెట్టాడని విమర్శించారు. అయినా తాము వెనుకడుగు వేయలేదన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు రాకుండా యుద్ధప్రాతిపదికన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపిపి పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, నాయకులు బసన్న, తిప్పయ్య, కరణం భీమరెడ్డి, రామాంజనేయులు, ఓబుళమ్మ, సుంకన్న, గిరిబాబు, గాజుల వెంకటేసులు, ఓబులేసు, తిమ్మరాజు, రమేష్, ఉమాశంకర్, అంపయ్య, కేసన్న, రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్లు నాగరాజు, వీరప్ప, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌కు సన్మానం

పాలిటెక్నిక్ కోర్సుకు సంబంధించిన పుస్తకాలను రాసి అవార్డు అందుకున్న ఉరవకొండ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కె.అస్రాఫ్‌అలీని సోమవారం కళాశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగమణి, వి.పద్మారావు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లు ఏ.నార్మల్ కుమార్, ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో ఒరిగిన వైఎస్సార్ విగ్రహం


ఒరిగిన వైఎస్ఆర్ విగ్రహం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో శివకళ జ్యోతి పక్కన ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహం పూర్తిగా ఒకవైపునకు ఒరిగిపోయింది. దీంతో ఏక్షణమైనా కూలిపోయే స్థితిలో ఉందని స్థానికుల అంటున్నారు. విగ్రహం పూర్తిగా కూలిపోకనే మరమ్మతులు చేపట్టాలని కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

రైతు రుణాలను మాఫీ చేయాలి

నార్పల : బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏపీ రైతుసంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సనప రామకృష్ణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతులు పంటలు సాగు చేసి వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, తిరిగి కొత్త రుణాలను ఇవ్వాలని, ఉచితంగా పశుగ్రాసం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపేదల పొట్ట కొట్టొద్దు..

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడులో గత టిడిపి ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి పేదల కడుపు కొట్టొద్దని టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ తహశీల్దార్ హరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ అర్హులు ఉంటే విచారణ చేసి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎర్రినాగప్ప, జాఫర్, రాజన్న, పిఠ రాజన్న, నాగలింగప్ప, ఆర్.రాజన్న, ఓబులేసు, కుళ్లాయప్ప, అంకన్న, నాగార్జున, చంద్రబాబు, పిఎల్.లక్ష్మీనారాయణ, అదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హత్య కుట్రలపై విచారించాలి

ఎంపీ గోరంట్ల మాధవ్‌పై టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబు హత్య కుట్రపై విచారించాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి డిమాండ్ చేశారు. ఈమేరకు ఇటీవల చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌పై సోమవారం నగరంలోని 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి వచ్చే ఎన్నికల్లో తమకు డిపాజిట్లు కూడా రావనే కుట్రతో వైసిపి నాయకులు కుట్ర చేసి జైలులో ఉంచారన్నారు. రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబు ఫొటోలు ఎలా బయటకు వస్తున్నాయని ప్రశ్నించారు. అలాగే ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వాఖ్యలు వైసిపి కుట్ర రాజకీయాలను బహిర్గతం చేస్తున్నాయన్నారు. కావున తమకు తలెత్తిన అనుమానాలపై విచారించి చంద్రబాబు ప్రాణాలకు ముప్పు వాటిల్ల కుండా చూడాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, దేవేళ్ల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నగర అధ్యక్షులు మారుతీకుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకురాలు శివబాల, గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : టిడిపి అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి సామాజిక బస్సుయాత్రలో చంద్రబాబు చస్తాడని వ్యాఖ్యలు చేసిన ఎంపీని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ కర్యాక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, నాయకులు కాటప్పగారి రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు, డేగల కృష్ణమూర్తి, అశోక్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, కేశన్న, హరి, బాబయ్య, నరేంద్ర యాదవ్, చితంబరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జోగిని, బసివినులు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూరు, గుంతకల్లు, తదితర ప్రాంతాలకు చెందిన బసివిని, జోగిని, మాతంగిలతో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం తన ఛాంబర్‌లై సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి జీవన స్థితిగతులపై ఆరాతీశారు. త్వరలోనే వారికి 2 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బసివిని, జోగిని, మాతంగి సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, బసివిని, జోగిని, మాతంగి సంఘం రాష్ట్ర నాయకురాలు నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


బసివిని, జోగిని, మాతంగిలతో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

నేరాలు ఘోరాలు

విశ్రాంత రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


జయరాం (పాతచిత్రం)

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో పెద్దవంక రైల్వే వంతెన వద్ద సోమవారం ఓ విశ్రాంత రైల్వే ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి జయరాం (65) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ వాసు, తదితరులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకుకారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సింది. జీఆర్పీ పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూదరుల బైండోవర్

అనంతపురం క్రైం : నగరంలోని వన్ టౌన్ పరిధిలో ఉన్న 14 మంది మట్కారాయుళ్లపై సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరందరినీ కళ్యాణదుర్గం ఆర్డీవో కోర్టులో హాజరు పరిచారు. రాబోయే ఏడాది కాలంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల పూచీకత్తు బాండ్లు తీసుకున్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ఉరవకొండ : వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో పలువురికి మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన కె.వి కుళ్లాయిస్వామి, విడపనకల్ మండలానికి చెందిన బి.చిన్నవన్నూరుస్వామికి మంజూరైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ వైసిపి నాయకులు రమణారెడ్డి, తిప్పారెడ్డి, కొనకొండ్ల రామచంద్ర, లాలెప్ప, రాగులపాడు రామలింగప్ప, వెలిగొండ బుసప్ప, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు సన్మానం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందిని సోమవారం స్థానిక స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామదాసు మాట్లాడుతూ ఇక్కడ విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ గంగన్న, కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, పవన్‌కుమార్, ఖాసీంవలి, మహిళా పోలీస్ కానిస్టేబుల్ పద్మజ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఏసుదాసు, పోలీస్‌సిబ్బంది నాగరాజు, రాజునాయక్,తదితరులు పాల్గొన్నారు

జెఎన్‌టియు ఎం.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎం.ఫార్మసీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

తాడిపత్రి తహశీల్దార్‌గా అలెగ్జాండర్

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి తహశీల్దార్‌గా అలెగ్జాండర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మునివేలు రాప్తాడుకు బదిలీపై కావడంతో యాడికిలో పని చేస్తున్న అలెగ్జాండర్‌ను ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేత

గుత్తి : ఐసిడిఎస్ గుత్తి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన నలుగురికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సోమవారం నియామక పత్రాలను అందజేశారు. పామిడి మండలం కలాపురం గ్రామానికి చెందిన ఎస్.పుల్లశ్రీ, గుత్తి మున్సిపాలిటీలో సాయి ప్రణవి, అలాగే గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన కె.సుమలత, గుంతకల్లు పట్టణంలోని స్లీపర్స్ కాలనీకు కె.సలీమా బేగం ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ డిల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టళ్లను ప్రారంభించాలి

గుత్తి : పట్టణంలో మూసివేసిన కళాశాల వసతి గృహాలను ప్రారంభించాలని కోరుతూ హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.మోహన్‌నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం గుత్తిలో బాలురు, బాలికల కళాశాల వసతి గహాలను నిర్వహించేవారన్నారు. అయితే ఇటీవల వాటిని అధికారులు మూసివేశారని చెప్పారు. వసతి గృహాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాల వసతి గహాలను ప్రారంభించాలనికోరారు. అలాగే వసతి గహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 3వ సోమవారం దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రతి సోమవారం అన్నదానం చేయడానికి నిర్ణయించినట్లు ఆలయ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు కే.రామచంద్రారెడ్డి, అర్.ఓబులేసు, కుందు శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'ఇండస్ట్రియల్ పార్కుకు భూములివ్వలేం'

రాయదుర్గం : ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సాగు భూములు ఇవ్వలేమని మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం మాజీ వైస్ ఎంపిపి జలంధరనాయుడు ఆధ్వర్యంలో పలువురు రైతులు తహశీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాతికేళ్లుగా 90 ఎకరాల అసైన్డ్ భూముల్లో 20 మంది రైతులు బోర్లు వేసుకుని మొక్కజొన్న, వేరుశనగ, చీని(నారింజ), దానిమ్మ, మామిడి, తదితర పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నామన్నారు. అయితే ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసిందన్నారు. సాగు భూములను కోల్పోతే జీవనాధారం లేకుండా పోతుందని వాపోయారు. పట్టా భూములు కాకుండా అసైన్డ్ భూములను పార్కు కోసం సేకరించడంలో ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. రైతుల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దార్ తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

రైతులకు ప్రాణసంకటం - చేతులకు అందే ఎత్తులో విద్యుత్ తీగలు


కింద వేలాడుతున్న కరెంటు తీగలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు ప్రాణసంకటంగా మారింది. మండల పరిధిలో పి.సిద్ధరాంపురం గ్రామానికి చెందిన రైతు కోమలపాటి బాబయ్య సాగు చేసిన చీనీ తోటలో చేతికి అందే చేతిలో విద్యుత్ తీగలు వెళ్లడంతో రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్ వైర్ల కారణంగా పంటలకు పురుగు మందులు పిచికారీ చేయాలంటే ప్రాణాలు చేతిలో పెట్టుకుని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పొలంలో వెళ్లిన విద్యుత్ వైర్లను తొలగించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తోటలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని రైతులు కోరుతున్నాడు.